## నేడు జాబ్‌మేళా

సిటీ బ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు మల్లేపల్లి ఐటీఐ కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి నరపత్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదివిన నిరుద్యోగులు అర్హత పత్రాలతో ఉదయం 11 గంటలకు హాజరుకావాలని సూచించారు. ప్రముఖ పారాడిగ్నిట్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలోని వంద ఖాళీలను భర్తీ చేసేందుకు అర్హులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాలకు ఎంప్లాయిమెంట్ డెవలప్‌మెంట్ వెబ్‌సైట్ లేదా 83284 28933 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## రాష్ట్రంలో తుగ్లక్ పాలన

**బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీష్‌రెడ్డి**

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో తుగ్లక్ పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై.సతీష్ రెడ్డి ఆగ్రహించారు. మంత్రి సీతక్క.. వాస్తవాలను చెప్పే పాత్రికేయులను, సమస్యలపై పోరాటం చేసేవారిని అణిచివేయడమే తమ సర్కార్ సిద్ధాంతం అనే విధంగా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాణం లేని పసిపాపతో రోడ్డుపై నిలబడ్డ ఆ తల్లిని పరామర్శించక పోగా.. అందుకు సంబంధించిన వార్త రాసిన జర్నలిస్టుపై కేసు పెట్టడం.. వారిని వేధింపులకు గురి చేయడం ఎంతవరకు సమంజసం అని ఆయన సూటిగా ప్రశ్నించారు. పేదల కోసం సాయుధ పోరాటం చేసిన అని చెప్పుకునే సీతక్క నేర్చుకున్నది ఇదేనా అని ఆయన తూర్పారపట్టారు. జర్నలిస్టు శ్రీధర్‌పై అక్రమ కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని.. దీనికి కారణమైన వారెవరైనా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన తన 'ఎక్స్' అకౌంట్ ద్వారా గురువారం మండిపడ్డారు.

# పన్ను వసూళ్లు సరే.. అభివృద్ధి సంగతేంటి?

- **మేడ్చల్ జిల్లాలో రూ.103 కోట్ల ముందస్తు ఆస్తి పన్నుల వసూళ్లు**
- **అభివృద్ధి పనులను పట్టించుకోని సర్కార్**
- **ప్రత్యేక అధికారుల పాలనలో ఎక్కడి సమస్యలు అక్కడే**

మేడ్చల్, మే8 (నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపాలిటీలలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్నులకు 5శాతం రాయితీని ప్రకటించిన నేపథ్యంలో 33 రోజులలో రూ.103 కోట్ల ఆస్తి పన్నులు వసూళ్లు అయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి ఈనెల 3 వరకు ముందస్తు ఆస్తి పన్నులు చెల్లించిన వారికి 5 శాతం రాయితీని అందించారు. దీంతో జిల్లాలోని 13 మున్సిపాలిటీలలో 28శాతం ఆస్తి పన్నుల వసూళ్లు జరిగాయి. నాలుగు కార్పొరేషన్ల పరిధిలో బోడుప్పల్‌లో రూ.8.98 కోట్లు, పీర్జాదిగూడ రూ.12.96 కోట్లు, జవహర్‌నగర్ రూ. 2.35 కోట్లు, నిజాంపేట్ రూ.26 కోట్లు వసూళ్లు జరగగా మున్సిపాలిటీలలో పోచారంలో రూ.4.28 కోట్లు, తూముకుంట రూ. 6.70 కోట్లు, నాగారంలో రూ.7.40 కోట్లు, మేడ్చల్‌లో రూ. 5.05 కోట్లు, కొంపల్లిలో రూ. 5.11 కోట్లు, ఘట్‌కేసర్‌లో 2.03 కోట్లు, గూండ్లపోచంపల్లిలో 7.76 కోట్లు, దమ్మాయిగూడలో రూ. 3.91 కోట్లు, దుండిగల్‌లో రూ.11.16 కోట్ల మేర పన్ను వసూళ్లు అయ్యాయి.




### పన్ను వసూళ్లపైనే దృష్టి..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలలో ఆస్తిపన్నుల వసూళ్లపై పెడుతున్న దృష్టి ఆయా ప్రాంతాల అభివృద్ధిపై పెట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. శివారు ప్రాంతాల మున్సిపాలిటీలలో అనేకంగా నూతన కాలనీలు ఏర్పడుతున్న క్రమంలో మౌలిక వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అవుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇప్పటివరకు మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి కూడా ప్రత్యేక నిధులు కేటాయించలేదు. దీనికితోడు మున్సిపాలిటీలు ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలో కొనసాగతున్న క్రమంలో ప్రత్యేక అధికారులు మున్సిపాలిటీలలో నెలకొన్న సమస్యలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలె మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మరో 24 గ్రామాలను కలిపి మూడు నూతన మున్సిపాలిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం విదితమే. అయితే ఆయా చోట్ల అభివృద్ధి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పన్ను వసూళ్లపై పెట్టే దృష్టి మౌలిక వసతుల కల్పనపై కూడా పెట్టాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.




సభలో ప్రసంగిస్తున్న నందిని సిధారెడ్డి

## తెలుగు భాష చైతన్య సమితి కృషి అభినందనీయం

**ప్రముఖ రచయిత నందిని సిధారెడ్డి**

ముషీరాబాద్, మే 8: తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో తెలుగు భాష చైతన్య సమితి 12వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం త్యాగరాయ గాన సభలో వేడుకగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నందిని సిధారెడ్డి మాట్లాడుతూ.. పుష్కరకాలంగా తెలుగు భాషా చైతన్య సమితి.. తెలుగు భాష చైతన్యం కోసం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. విద్యార్థులు సంస్కృతాన్ని మార్కుల కోసం కాకుండా భాషపై పట్టు సాధించడం కోసం చదువుకోవాలని, సంస్కృత పరీక్ష సంస్కృతంలోనే రాయాలని సూచించారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని అనాన్నరు. రామకృష్ణ చంద్రమౌళి అధ్యక్షత వహించిన ఈ సభలో ఆచార్య పిల్లలమర్రి రాములు, ఆచార్య ఖాసిం, ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ఆచార్య ఇటికాల పురుషోత్తం, తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షుడు బడేసాబ్, రామకృష్ణ చంద్రమౌళి, డాక్టర్ జయప్రకాష్, ఆవ మల్లయ్య, డాక్టర్ ఎడ్ల కల్లేశ్, నాలేశ్వరం శంకరం డాక్టర్ ఎన్ బాలాచారి, డాక్టర్ బీ జయరాములు, డాక్టర్ మల్లికార్జున్, డాక్టర్ బి.రాజారత్నం తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమ్మేళనంలో 300 మంది కవులు పాల్గొని తెలుగు భాష, ఇతర అంశాలపై తమ కవితలని వినిపించారు.

# సంక్షోభంలో వ్యవసాయరంగం

- **ఆర్థిక నిపుణులు పాపారావు**
- **ఇందిరాపార్కు వద్ద అఖిల భారత ఐక్య రైతు సంఘంతో కలిసి ధర్నా**

కవాడిగూడ, మే 8: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తప్పుడు విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభం ఎదుర్కొంటోందని వ్యవసాయ ఆర్థిక నిపుణులు డీ పాపారావు అన్నారు. మోదీ రైతులకు ఇచ్చిన హామీల అమలు, సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన గ్యారెంటీల అమలు, రైతు పండించిన పంటలకన్నింటికీ స్వామినాథన్ కమిషన్ ప్రతిపాదనలకు అనుగుణంగా సమగ్ర పంటలు ఖర్చు ప్రాతిపదికన కనీస మద్దతు ధరలు నిర్ణయించాలని, కనీస మద్దతు ధరల కేంద్ర చట్టం సాధనకై అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో వ్యవసాయ ఆర్థిక నిపుణులు పాపారావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఏఐయుకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల ప్రభాకర్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ.. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు తమ వైఖరిని మార్చుకొని రైతు అనుకూల విధానాలు అమలు చేయకపోతే దేశానికి ఆహార భద్రత ఉండదన్నారు. రైతాంగ రుణాలన్నీ రద్దుచేసి జాతీయ వ్యవసాయ మార్కెటింగ్ విధానాన్ని ఉపసంహరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అటవీ హక్కుల చట్టం-2006ను చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని, సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉప్పల ప్రభాకర్ మాట్లాడుతూ.. స్వామినాథన్ సిఫార్సుల మేరకు సమగ్ర ఖర్చుల మీద 50 శాతం లాభం కలిపి ధరలు నిర్ణయించాలన్నారు. అప్పుడే రైతుల ఆదాయం పెరిగి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు డి.రాము, సహాయ కార్యదర్శి నందిరామయ్య, చంద్రన్న, దేవరాం, భిక్షమన్న, యాదగిరి సురేశ్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న అఖిల భారత ఐక్య రైతు సంఘం నాయకులు

# ఇది ప్రభుత్వ స్థలం.. కాదు ఇది మా స్థలం

- **ఉద్రిక్తతకు దారితీసిన దుండిగల్ భూముల పరిశీలన**
- **హద్దురాళ్లు ఏర్పాటు చేసేందుకు వచ్చిన అధికారులతో స్థానికుల వాగ్వాదం**

దుండిగల్, మే 8: గండి మైసమ్మ-దుండిగల్ మండలంలోని ప్రభుత్వ భూముల పరిశీలన ఉద్రిక్తతకు దారితీసింది. మండల పరిధి డి.పోచంపల్లిలోని సర్వేనెంబర్ 120/11 ప్రభుత్వ భూమిలోని 2 ఎకరాల 25 గుంటల స్థలాన్ని 2016లో అప్పటి ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ సంస్థకు కేటాయించింది. అయితే సర్వేనెంబర్ 120లోని ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నట్లు వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో సంబంధిత స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసేందుకు నిర్ణయించుకున్న ట్రైబల్ వెల్ఫేర్ సంస్థ అధికారులు.. సంబంధిత స్థలం హద్దుపద్దులను చూపించాలని రెవెన్యూ అధికారులను కోరగా, గురువారం ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో కలిసి రెవెన్యూ అధికారులు హద్దులు ఏర్పాటు చేసే పనులను చేపట్టారు. అయితే సదరు స్థలంలో తమకు పట్టాలు ఉన్నాయంటూ తమ స్థలాన్ని కొంతమేర ట్రైబల్ వెల్ఫేర్ స్థలంలో కలుపుతున్నారని స్థానికులు కొందరు కోర్టు జారీచేసిన కాగితాలతో వచ్చి హద్దురాళ్ల ఏర్పాటును వ్యతిరేకించారు. హైకోర్టు దీనిపై స్టే విధించిందని కొందరు పేర్కొనగా, మరికొందరికి జీవో నెంబర్ 58, 59 ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని పేర్కొంది అంటూ అధికారుల స్థల పరిశీలనను, హద్దురాళ్ల ఏర్పాటును అడ్డుకునే ప్రయత్నం చేశారు. 2016 నుంచి రాని ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు కోర్టుకు సెలవులు ఉన్న రోజుల్లో వచ్చి తమకు అన్యాయం చేయాలని చూస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య స్థల పరిశీలన చేసిన రెవెన్యూ అధికారులు హద్దురాళ్లని ఏర్పాటు చేశారు. దీంతో తాము మళ్లీ కోర్టును ఆశ్రయిస్తామని స్థానికులు పేర్కొనడం గమనార్హం.



పోచంపల్లిలో స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు

## ఆపరేషన్ సిందూర్‌ను స్వాగతిస్తున్నాం

**దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ: పహల్గాం ఉగ్రదాడికి జవాబుగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంపై భారత సైనికులను అభినందిస్తున్నామని దక్షిణాది జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ అన్నారు. పాకిస్థాన్ ఉగ్రస్థావరాలపై భారత జవాన్లు జరిపిన దాడిని చూసి ఒక భారతీయుడిగా గర్విస్తున్నానని చెప్పారు. తార్నాకలోని తన కార్యాలయంలో బహుజన విద్యార్థి సంఘాల జేఏసీ చైర్మన్ సంజయ్‌తో కలిసి గురువారం ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాద నిర్మూలనతో పాటు భారత్‌తో పెట్టుకుంటే ఎలా ఉంటుందో భారత సైనికులు నిరూపించారని పేర్కొన్నారు. ఆత్మరక్షణ కోసం అనివార్యమైనప్పుడు యుద్ధం చేయక తప్పదని అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వం, రక్షణ దళాలకు దేశం మొత్తం మద్దతుగా నిలుస్తోందని చెప్పారు.

## కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి



డంపింగ్‌యార్డ్ ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

జవహర్‌నగర్, మే 8: నిబంధనలు పాటించకుండా అర్హతలేని కార్మికులతో పని చేయిస్తూ కార్మికులను పొట్టనపెట్టుకుంటున్న హెచ్ఎంఈఎస్‌పీఎల్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, చనిపోయిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50లక్షల పరిహారం చెల్లించాలని కేవీఆర్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) డంపింగ్ యార్డ్ అధ్యక్షుడు డీజీ నర్సింహారావు డిమాండ్ చేశారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో పవర్ ప్లాంట్‌లో పనిచేస్తుండగా మృతి చెందిన ముగ్గురు కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం డంపింగ్‌యార్డ్ ఎదుట సీఐటీయూ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ.. కార్మికుల మృతిపై పరిశ్రమల ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో న్యాయ విచారణ జరిపించి నిజనిర్ధారణలు చేయాలని పేర్కొన్నారు. వలస కార్మికులకు అండగా ఉంటామని వారి హక్కులను పరిరక్షిస్తామని తెలిపారు. కార్మికుల కుటుంబాలకు డంపింగ్‌యార్డ్ యాజమాన్యం న్యాయం చేయాలన్నారు. కేవీఆర్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, మేడ్చల్ సీఐటీయూ అధ్యక్షుడు అశోక్ పాల్గొన్నారు.

# విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి

**ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి**

మల్కాజిగిరి, మే 8: పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మల్కాజిగిరి మండల పరిధిలో పదవ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులను గురువారం ప్రొబెల్స్ స్కూల్ ఆవరణలో ఎమ్మెల్యే సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, మురుగేష్, మల్లికార్జున్, రావుల అంజయ్య, పుల్ల వెంకన్న, రాము యాదవ్, రమేష్, ప్రభాకర్, ఉపేందర్, నర్సింగ్, శ్రీకాంత్ యాదవ్, శ్రీనివాస్, రాజు, వెంకట్, ఉమాపతి, లక్ష్మి, సాయిగౌడ్, సుమన్, ఓంరాజు, బాబూరావు, విష్ణు, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**సమన్వయంతో పనిచేయాలి..**

నేరేడ్‌మెట్, మే 8: అభివృద్ధి పనుల విషయంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని అల్వాల్‌లో స్థానిక కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, ఆయా విభాగాల అధికారులతో కలిసి గురువారం ఎమ్మెల్యే పర్యటించారు. స్థానికంగా చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. అన్నివిభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఈఈ శ్రీకాంత్, డీఈ రఘు, ఏఈ రవళి, జలమండలి జనరల్ మేనేజర్ సునీల్, క్రిష్ణమాచారి, రమేష్, డీఈ సుబ్బారెడ్డి, ఏడీఈ రామాచారి, 33 కేవీ డీఈ సునీల్, మాజీ ఎంబీసీ చైర్మన్ శ్రీధర్, బీఆర్ఎస్ నాయకులు డోలి రమస్తేష్, అనిల్ కిషోర్ గౌడ్, లక్ష్మన్, శోభన్, పరమేష్, శ్రీనివాస్, అరుణ్, సురేష్, శరణ్ గిరి తదితరులు పాల్గొన్నారు.

## జంట జలాశయాల పరిశీలన

సిటీ బ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): మూసీ పరీవాహక ప్రాంత అభివృద్ధి పనుల్లో భాగంగా జంట జలాశయాలైన ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌లను ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఈవీ నరసింహారెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రిజర్వాయర్ల స్టోరేజీ సామర్థ్యం, ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోకు సంబంధించిన వివరాలను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ వారికి వివరించారు. మూసీలోకి మంచినీటి విడుదల, ఇతర సాంకేతిక అంశాలపై అధికారులతో నర్సింహారెడ్డి ఈ సందర్భంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌డీసీఎల్ జాయింట్ ఎండీ గౌతమి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్యనారాయణ, చీఫ్ ఇంజనీర్ దత్తు పంత్, మెయిన్ హార్ట్ కన్సల్టెంట్స్, హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ సూపరింటెండెంట్ ఇంజినీర్ బ్రిజేశ్ పాల్గొన్నారు.

## సిబిల్ స్కోర్ నిబంధన ఎత్తివేయాలి

**సీఎస్‌కు సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ రాష్ట్ర కమిటీ వినతి**

కీసర, మే 8: రాజీవ్ యువశక్తి పథకం కింద ఇచ్చే సబ్సిడీలో సిబిల్ స్కోర్ నిబంధన తీసివేయాలని చీఫ్ సెక్రటరీకి సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ రాష్ట్ర కమిటీ విన్నవించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణకు కీసర మండలం యాద్గార్‌పల్లి నివాసి సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ చైర్మన్ గాలిగల్ల సాయిబాబా, విద్యార్థి నిరుద్యోగ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కొంపల్లి రాజు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిరుద్యోగుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన రాజీవ్ యువశక్తి వికాస పథకం కింద దాదాపు 16 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. ఈ మధ్య కాలంలో ప్రభుత్వం కొత్తగా అభ్యర్థులకు సిబిల్ స్కోర్ ఉంటేనే పథకానికి అర్హత ఉంటుందని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. సిబిల్ స్కోర్ పెడితే చాలామంది నిరుద్యోగ యువకులు నష్టపోయే ప్రమాదం ఉందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్దేశ్య పూర్వకంగానే నిరుద్యోగులను మోసం చేయడానికి సిబిల్ స్కోర్ విధానాన్ని తీసుకొచ్చారని వారు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సీఎస్ కూడా ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు.

# కాన్సులేట్‌ల వద్ద పటిష్ట బందోబస్తు

బంజారాహిల్స్, మే 8: పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడి నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ముఖ్యమైన ప్రాంతాల్లో నిఘా ఏర్పాట్లు చేయడంతో పాటు పలు దేశాలకు చెందిన రాయబార కార్యాలయాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. జూబ్లీహిల్స్‌లోని టర్కీ కాన్సులేట్ కార్యాలయం, బంజారాహిల్స్ రోడ్ నం. 7లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయంతో పాటు పలు దేశాలకు చెందిన కాన్సులేట్ కార్యాలయాల వద్ద భద్రతా ఏర్పాట్లను బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డి పరిశీలించారు. సెక్యూరిటీ ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలని సూచనలు చేశారు. జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## టీజీఈసెట్ పరీక్షకు సర్వం సిద్ధం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 12న నిర్వహించనున్న టీజీ ఈసెట్-2025 పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు కన్వీనర్ ప్రొఫెసర్ పి.చంద్రశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులకు ఇంజినీరింగ్ రెండో సంవత్సరంలో ప్రవేశం కోసం ఈ పరీక్షను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 19,672 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికోసం 86 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్ష కేంద్రాన్ని ముందస్తుగా చూసుకోవాలని సూచించారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి 12 వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు. పరీక్ష ప్రారంభానికి నిమిషం ఆలస్యమైనా అభ్యర్థులను అనుమతించబోమని స్పష్టం చేశారు.

## దేశ రక్షణలో సైనికుల పాత్ర ఎనలేనిది

**పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి**

హైదరాబాద్, మే 8 (నమస్తే తెలంగాణ): దేశ రక్షణలో సైనికుల పాత్ర వెలలేనిదని తెలంగాణ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అభినందించారు. పీవోకేలోని ఉగ్రవాద స్థావరాలను గుర్తించి, వాటిని సాహసోపేతంగా సైన్యం నాశనం చేసిందని కొనియాడారు. ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి మన రక్షణ సామర్థ్యం వెల్లడైందని తెలిపారు. దీనిద్వారా మనదేశ గౌరవం, సార్వభౌమత్వం ప్రపంచ పటంపై మరోసారి నిరూపితమైందని ప్రశంసించారు.భారత సైనిక చర్య ప్రతి భారతీయుడికి గర్వకారణంగా నిలిచిందన్నారు. ఉగ్రవాదంపై పోరులో భారత ఉక్కు సంకల్పానికి ఇది నిదర్శనమని తెలిపారు.

## మరో రెండు రోజులు వర్షాలు

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాగల రెండు రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు,మరికొన్ని చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా ఆవర్తన ప్రభావంతో నగరంలో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు 36.2 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతగలు 23.5డిగ్రీలు, గాలిలో తేమ 32శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.

# శిథిలావస్థ భవనాలపై నివేదిక ఇవ్వండి

- **వర్షాకాలంలోపు రక్షణ చర్యలు తీసుకోవాలి**
- **జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్**

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): రానున్న వర్షాకాలం నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శిథిలావస్థలోని భవనాలు, కట్టడాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రత్యేక సర్వేలు నిర్వహించి శిథిల భవనాలు, కట్టడాలు, పాత ప్రహరీలు మొదలైన వాటిని గుర్తించాలని అన్నారు. అలా గుర్తించిన భవనాలపై ఇంజనీరింగ్ విభాగం నివేదిక ఆధారంగా నిర్మాణ భద్రతను అంచనా వేయాలని సూచించారు. ప్రతి సర్కిల్ స్థాయిలో నివేదిక ప్రకారం తుది జాబితాను సిద్ధం చేయాలని కమిషనర్ చెప్పారు. శిథిలావస్థలోని ప్రభుత్వ పాఠశాల భవనాలు గుర్తిస్తే తక్షణమే విద్యాశాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అలాగే గుర్తించిన శిథిలావస్థ భవనాలకు నోటీసులు జారీ చేయాలని, అత్యంత ప్రమాదకరంగా ఉన్న భవనాలను తక్షణమే ఖాళీ చేయించడం లేదా సీల్ వేయాలని, భవనాల చుట్టూ బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. భవన యజమానులు మరమ్మతులు చేపడితే, అవి జీహెచ్ఎంసీ ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని, శిథిల భవనాల కూల్చివేతకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. ప్రతి భవనం వివరాలను గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో అప్‌డేట్ చేయాలని, నివేదికను జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సమర్పించాలని ఆదేశించారు. అన్ని సర్కిళ్ల డిప్యూటీ సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు తక్షణమే చర్యలు తీసుకుని నివేదిక సమర్పించాలని, జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్ (మెయింటెనెన్స్) ఆధ్వర్యంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు నిర్మాణ స్థిరత్వం, పటిష్టతపై నివేదిక అందజేయాలని, జోనల్ కమిషనర్లు తమ సర్కిళ్లలో ఈ ప్రక్రియను సమీక్షించి నిర్దేశిత గడువులో చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు. శిథిలావస్థ భవనాలు స్ట్రక్చర్లపై నిబంధనల మేరకు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం, జాప్యం చేసినట్లయితే సంబంధిత అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని కమిషనర్ హెచ్చరించారు.

## 11న నరసింహస్వామి జయంతి వేడుకలు

సిటీబ్యూరో, మే 8 (నమస్తే తెలంగాణ): ఈనెల 11న హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి వేడుకలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10:30 గంటలకు స్వామివారి కల్యాణం, సాయంత్రం మహాభిషేకం ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందగలరని సూచించారు.

## ఓయూ ప్రొఫెసర్‌కు ఉమెన్ ఇన్నోవేటర్ అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ సందీప్త బూర్గుల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ మైక్రో బయాలజీ విభాగం ప్రొఫెసర్ సందీప్త బూర్గుల ప్రతిష్ఠాత్మకమైన ఉమెన్ ఇన్నోవేటర్ అవార్డు సాధించారు. మలేషియాలోని మణిపాల్ యూనివర్సిటీ కాలేజ్‌లో ఇటీవల 'రీసెంట్ ఇన్నోవేషన్స్ ఇన్ బయోలాజికల్, కెమికల్ అండ్ క్లినికల్ సైన్సెస్'పై నిర్వహించిన 2వ అంతర్జాతీయ సదస్సులో ఆమెకు ఈ అవార్డును ప్రదానం చేశారు. ప్రతి 6 మంది ఐసీయూ రోగులలో ఒకరికి వచ్చే ప్రమాదకరమైన 'సెప్సిస్'ను త్వరితగతిన, అతి తక్కువ ఖర్చుతో గుర్తించేందుకు రూపొందించిన 'ఎ గోల్డ్ నానో పార్టికల్' ఆధారిత పరీక్షను కనుగొనడంలో ఆమె పాత్రను గుర్తించి ఈ అవార్డును అందజేసినట్టు నిర్వాహకులు వివరించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధికారులు, అధ్యాపకులు అభినందించారు.